వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 37
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
అక్టోబర్ 22, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## ఘనంగా కొమురం భీం జయంతి వేడుకలు

- నివాళులర్పించిన మంత్రి సురేఖ
- ఆదివాసీల హక్కులకై పోరాడిన యోధుడు
- జల్-జంగల్-జమీన్ ఆయన నినాదం




# అసాధ్యుడు కొండా మురళి

- అభాగ్యులకు కొండంత అండ
- పేదల పెన్నిధిగా ప్రత్యేక గుర్తింపు
- ప్రతి విషయంలో సమగ్ర ప్రణాళిక, లక్ష్యం ఆయన సొంతం
- ఆధిపత్యం ప్రదర్శించడంలో దిట్ట
- 62వ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం

పొడుస్తున్న పొద్దు మీద ఉదయించిన సూర్యుడు కొండా మురళీధర్ రావు. చిన్నతనంనుంచే నాయకత్వ లక్షణాలను పునికిపుచ్చుకున్న ప్రజా నాయకుడు. ఆయనను అందరూ 'కేఎం' అంటూ ముద్దుగా పిలుచుకున్నా 'కొండా మా అండ' నినాదమే ఎక్కువగా పాపులర్ అయింది. కేఎం అంటే అదోక బ్రాండ్.. అక్రమార్కుల పాలిట సింహ స్వప్నం.. అభాగ్యులకు కొండంత అండ. ఆయన పేరు చెబితేనే విపక్షమే కాదు స్వపక్షంలోనూ హడల్. ఆయన అందరికంటే భిన్నమైన రాజకీయ నేత. ఆయనకు ఓ సమగ్ర ప్రణాళిక, లక్ష్యం ఉంటుంది. రాజకీయాల్లో ఎత్తు.. పల్లాలు చవిచూసిన ఆయనకు ప్రతి విషయంపై స్పష్టత ఉంటుంది. ఎక్కడ ఎలా వ్యవహరించాలో ఆయనకు బాగా తెలుసు. ప్రత్యర్థి వర్గాల ఎత్తుగడలను, ఆలోచనలను సులువుగా గుర్తించడంలో ఆయన ఘనాపాటి. అద్భుతమైన ఆలోచనలు.. క్షణాల్లో నిర్ణయాలు.. విపక్షాలపై ఆధిపత్యం ప్రదర్శించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. సమయస్ఫూర్తితో వ్యవహరించడంలో కేఎంకు ఎవరూ సాటి రారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ 62వ జన్మదినం సందర్భంగా వరంగల్ వాయిస్ ప్రత్యేక కథనం. - వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు 7,8లో..

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ




2లో..



2లో..

## రోడ్డెక్కిన పోలీసుల భార్యలు

మామునూరు బెటాలియన్ ఎదుట ధర్నా

## గౌడలకు అండగా ఉంటాం..

- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పలువురికి కాటమయ్య రక్ష కిట్స్ పంపిణీ
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత



2లో..

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు కుటుంబ సభ్యులుగా పనిచేస్తూ ములుగు జిల్లాను చింతలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి ములుగు జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా గ్రామాల ప్రజలు చర్చించి నివేదికను సమర్పించాలని సూచించారు. అధికారులు వారి పనితనాన్ని మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులను ప్రజలకు ఉపయోగపడే పనులను చేస్తూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రానున్న మినీ మేడారం జాతరకు గ్రామంలో భక్తులకు ఉపయోగపడేలా శాశ్వత పనులు చేపట్టాలన్నారు. ప్రతి శాఖ అధికారి తన కింది స్థాయి సిబ్బందితో నిత్యం సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అవసరమైతే ఇతర శాఖల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రాలతో కలసి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం కింద 52మంది లబ్ధిదారులకు మంత్రి దనసరి అనసూయ చెక్కులు అందజేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె.సత్య పాల్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ విజయ భాస్కర్, నేషనల్ హైవే, పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్, ఆర్ డబ్లూఎస్, ఎలక్ట్రిసిటీ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన పోలీసుల భార్యలు

**మూమునూరు బెటాలియన్ ఎదుట ధర్నా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రజల జీవితాలకు, రాజకీయ నాయకుల ఆస్తులకు, రక్షణ కల్పిస్తున్న పోలీసు భార్యలు మంగళవారం రోడ్డెక్కారు. కానిస్టేబుళ్లను వెట్టిసాకిరి చేపిస్తూ.. కనీసం సెలవులు కూడ ఇవ్వకుండా కుటుంబానికి దూరం చేస్తున్నారని పోలీస్ భార్యలు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ మేరకు వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కానిస్టేబుళ్ల భార్యలు రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహించడంలో అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. అయితే నిరసనను ఆపేందుకు ఆర్టీఓ ఆఫీస్ నుంచి మామునూరు బెటాలియన్ వరకు పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీంతో వారంతా గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు రిజర్వ్ పోలీసుల బాధలను సీఎం రేవంత్ రెడ్డి అర్థం చేసుకోవాలని కోరారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల భార్యలు రోడ్డెక్కడంపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి.



## గౌడలకు అండగా ఉంటాం..

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** గౌడ కులస్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శ్రీహరి చేతులమీదుగా కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గౌడ కులస్తులకు ఇప్పటికే పెన్షన్ అందిస్తున్నామని, ప్రమాదవశాత్తు తాడిచెట్టు పై నుంచి పడి చనిపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియాను అందిస్తున్నామని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఈ వృత్తిలో ఎక్కువ మంది కొనసాగే విధంగా గౌడన్నలకు గ్రామాలవారిగా ట్రైనింగ్ ఇచ్చి సేఫ్టీ కిట్స్ అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ పరిధిలోని 52 మంది లబ్ది దారులకు రూ.15.44 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, వ్యవసాయ కమిటీ అధ్యక్షురాలు లావణ్య, వైస్ చైర్మన్ ఐలయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసీ పోరుబిడ్డ కొమురం భీం

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఘనంగా కొమురం భీం జయంతి, నాయిని నర్సింహా రెడ్డి వర్ధంతి కార్యక్రమాలను మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీం అని కొనియాడారు. ఆదివాసులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడిన పోరుబిడ్డ అని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ బిడ్డ కొమురం భీంనకు సముచిత గౌరవం ఇవ్వడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కొమురం భీం పేరిట జిల్లా కూడా ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. అదేవిధంగా నాయిని నర్సింహా రెడ్డి కార్మిక పక్షపాతి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వారు ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులుగా వారు పార్టీకి ఎంతో సేవ చేశారన్నారు. కార్మిక శాఖ మంత్రి, హోం శాఖ మంత్రిగా ఆయన తెలంగాణకు ఎనలేని సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, నాయకులు నయీముద్దీన్, సుంచు కృష్ణ, జానకి రాములు, యాకుబ్, కోటేశ్వర్ రావు, విజయ్, రఘు, రామ్మూర్తి, శ్రీధర్ రావు, గౌస్, ప్రశాంత్, శ్రీకాంత్, రాకేష్, స్నేహిత్, శ్రీనివాస్, దేవమ్మ, రాజేష్, మహమూద్, రజినీ కుమార్, వెంకన్న, కనకరాజు, చిన్న, మహేష్, వీరు, ఖలీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమురం భీం జయంతి వేడుకలు

**నివాళులర్పించిన మంత్రి సురేఖ**

అంధకారపు అణచివేత పొరలను చీలుస్తూ ఉదయించిన ఆదివాసీ వీరుడు కొమురం భీం అని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం కొమురం భీం జయంతి సందర్భంగా సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో మంత్రి సురేఖ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆత్మగౌరవ పోరాటాలకు, అస్తిత్వ ఉద్యమాలకు కొమురం భీం స్ఫూర్తినిచ్చాడని మంత్రి కొనియాడారు. జల్, జంగల్, జమీన్ నినాదమే తెలంగాణలోని సబ్బండ వర్గాలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమించేలా ప్రేరణనిచ్చాయని మంత్రి అన్నారు. కొమురం భీం త్యాగాలకు గుర్తుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు పూర్వమే పెదవాగు నదిపై ఆయన పేరుతో ప్రాజెక్టును చేపట్టి, ఆయన త్యాగాలను గుర్తించిందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. కొమురం స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ గొప్ప పోరాటం చేసి, నియంతృత్వాన్ని తుదముట్టించి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. భీం ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## బస్ స్టేషన్ నిర్మాణానికి భూమి ఇవ్వండి

**డీఆర్ఎంను కలిసిన నాయిని**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మెనేజర్ భర్తేష్ కుమార్ జైన్ తో మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమావేశం అయ్యారు. రద్దీ ప్రాంతంగా ఉన్న కాజీపేట ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణం కోసం రైల్వే స్టేడియంలో ఎకరం స్థలం కేటాయించాలని కోరుతూ డీఆర్ఎంకి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రతి ప్రయాణికులు కాజిపేట మీదుగా వెళ్తున్న విషయాన్ని ఆయనకు తెలియజేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా బస్ స్టేషన్ నిర్మాణానికి సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రధాన రహదారి వెంట ఉన్న రైల్వే స్టేడియంలో నుంచి కొంత స్థలం కేటాయిస్తే ట్రాఫిక్ సమస్యలను కూడా నివారించవచ్చని సూచించారు. ఈ విషయాలపై సమీక్షించి, తక్షణ చర్యలు చేపడతామని డీఆర్ఎం హామీ ఇచ్చారని నాయిని తెలిపారు. తన అభ్యర్థనలపై సానుకూలంగా డీఆర్ఎం స్పందించినందుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులకు వీజీఎస్ గైడ్స్ పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తీగరాజుపల్లె గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు"ఏవీఆర్ ఫౌండేషన్ "వ్యవస్థాపకుడు సోమిడి రమాదేవి-అంజన్ రావు 12మందికి రూ.25,000 విలువ చేసే వీజీఎస్ గైడ్స్ సబ్జెక్ట్స్ వారీగా అందజేశారు. ఈ సందర్భంగా సోమిడి అంజన్ రావు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానాలను చేరడానికి పదవ తరగతి అనేది తొలి మెట్టని, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళిక పరంగా చదివితే ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా 10/10 జీపీఏ సాధించవచ్చునన్నారు. ఏవీఆర్ ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్ అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామంలోని సొలగుడి ప్రమోద్, రంగరాజు అశోక్, ఐత కుమార్, హంస అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సంతను సద్వినియోగించుకోండి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని గంగిరేణి గూడెం సూర్య నాయక్ తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సంతకు చుట్టూ ఇరు వైపుల గ్రామ ప్రజలు, గ్రామాల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న టీం మండల అధ్యక్షుడు, సూర్య నాయక్ తండా యూత్ అధ్యక్షుడు తీన్మార్ జయ్ మాట్లాడుతూ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఈ సంత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, యువతులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించాలి




**వరంగల్ వాయస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండ, వడ్డేపల్లి రోడ్డులోని సాయి స్పందన హైస్కూల్ పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మేనుషరల్ హైజినిన్ పై అవగాహన, తల్లిదండ్రులు పిల్లలతో ఎలా ఉండాలి అనే అంశాలపై ముఖ్య అతిథిగా హాజరై వివరించారు. పాఠశాల కమిటీ మెంబర్ వాసుదేవ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు తల్లి దండ్రులు సమయం కేటాయించాలని, పిల్లలు చెప్పేది వినాలని, పిల్లలను గొప్పగా పెంచడం కాదని మంచి విలువలతో పెంచాలన్నారు. అతి గారాబం చేయవద్దని, పాఠశాల అంటే విద్య మాత్రమే నేర్పించడం కాదని, మంచి నడవడిక, క్రమశిక్షణ, మంచి విలువలు నేర్పించి దేశానికి మంచి పౌరులుగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నతనం నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏంటి ఎలా గుర్తించాలి, అలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు, అలాంటి వారి బారిన పడితే ఎలా తమను తాము ఎలా రక్షించుకోవాలి వంటి విషయాలను సూక్ష్మంగా ఉదాహరణలతో పిల్లలకు వివరించి అవగాహన కల్పించారు. నెలసరి సమయంలో పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. ఇవన్నీ కూడా మాట్లాడుకునే అంశాలని ముందు తల్లిదండ్రులు, పిల్లలు గుర్తించాలని డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, వాసుదేవ రెడ్డి, రంగయ్య, లక్ష్మి, టీచర్స్, పిల్లలు పాల్గొన్నారు.

# మతోన్మాద దోపిడీ విధానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం

### ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు ఉపేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద దోపిడి విధానాలకు మార్క్సిజం, అంబేద్కర్ ఆలోచన విధానమే ఏకైక ప్రత్యామ్నాయమని, అందుకోసం నికరంగా నిలబడి ముందుకు సాగుతున్న పార్టీ ఎంసీపీఐ(యూ) మాత్రమేనని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం అలంకార్ సెంటర్ లో ఉన్న కర్ర రాజిరెడ్డి ఇంట్లో జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ ఉస్మాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎంసీపీఐ (యూ) వ్యవస్థాపకుడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అసెంబ్లీ టైగర్ అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి రాష్ట్ర కమిటీ సభ్యులు మాస్ సావిత్రి, కర్ర రాజీ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రమాదపు అంచుల్లో ఉన్నదని, ఒకే దేశం ఒకే ఎన్నిక ఒకే మతం అంటూ భిన్నత్వంలో ఏకత్వాన్ని, లౌకిక విలువలను మంటగలుపుతున్నారని, రాజ్యాంగంలో సామాజిక తరుగుతులకు అంబేద్కర్ కల్పించిన హక్కులను అమలు చేయకుండానే అడ్డుకుంటూ అంబేద్కర్ ఆలోచన విధానాలను వంట కలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్సిజం దోపిడిని వ్యతిరేకిస్తే అంబేద్కర్ ఆలోచన విధానం సామాజిక అణిచివేతను ధిక్కరించిందని, ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక ఆర్థిక శ్రమ దోపిడిని అరికట్టి దేశ ప్రజల మధ్య ఎలాంటి వైషమ్యాలు లేని భారత సమాజం కోసం మార్క్సిజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానం జోడెద్దుల్లాగా అమలు కావడానికి పూనుకోవాలన్నారు. అందుకు అడ్డుగా ఉన్న మనువాద కార్పొరేట్ అనుకూల పాలకులకు వ్యతిరేకంగా వర్గ సామాజిక ఐక్యతతో పోరాటాలను ఉదృతం చేయాలని, అందుకు అమరజీవి మద్దికాయల ఓంకార్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భ్రష్టు పట్టిన రాజకీయాల్లో సిద్ధాంతాలకు, విలువలకు తిలోదకాలు ఇచ్చి స్వార్థపూరిత ఆలోచనలతో పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకుంటూ ఇబ్బందుల గురి చేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఓట్లు, సీట్లు అధికారం లక్ష్యంగా కాకుండా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎర్రజెండా కార్యకర్తలు మొక్కవోని దీక్షతో అనేక ఆటుపోట్లు నిర్బంధాలు ఎదురైన నిలబడి ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనే కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నిలా రవీందర్, కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజి రెడ్డి, చీపురు ఒదయ్య, కమిటీ సభ్యులు ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల పాఠశాలలో అన్నదానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని కొత్త వాడలోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రముఖ యోగ గురువు పోశాల శ్రీనివాస్ తెలియజేశారు. ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల అనిల్ కుమార్తె రిషిక జన్మదినం సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా అంధుల ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న మణిశంకర్ నేటి సమాజంలో ఉన్నటువంటి చాలామంది యువతకుస్ఫూర్తి ప్రదాతగా నిలుస్తాడని తెలిపారు. సమాజంలో ఉన్న ప్రతి కుటుంబం ఇలా కళ్ల లేని ఆత్మీయుల మధ్య శుభకార్యాలను నిర్వహించుకోవడం దైవ కార్యక్రమంగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి గొడిశాల సూరజ్ గౌడ్, వర్ధన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, అంధుల ఆశ్రమ నిర్వాహకుడు మణిశంకర్, సట్ల అనిల్, తండా అశోక్, గడ్డం సాయి పాల్గొన్నారు.

## జీవో 29కి వ్యతిరేకంగా బీసీ పొలిటికల్ జాక్ ఆందోళన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలో జీవో 29కి వ్యతిరేకంగా బీసీ పొలిటికల్ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నేతలు ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, డాక్టర్ కాళి ప్రసాద్, డాక్టర్ లక్ష్మి ప్రసాద్ నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆందోళనకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ జీవో 29ను ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా తీసుకువచ్చిందన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ ఇతర అభ్యర్థులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం బ్యాక్ డోర్ తో తలుపులు తెరిచిందని మండిపడ్డారు. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు జీవో 29 తో మరణ శాసనం లిఖిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి వరంగల్ ఎలా కేంద్రమైందో అదే తరహాలో ఇక్కడి నుంచి మరో బీసీ ఉద్యమం ఉద్భవిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు ఇలాగే ఉంటే వేలాది మంది బీసీలు ప్రభుత్వంపై దండెత్తాల్సిన అవసరం వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ తో సహా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ అభ్యర్థుల నియామకాల్లో ప్రభుత్వం సింహభాగం కేటాయించాలని బీసీ పొలిటికల్జాక్ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అన్నారు.

# బీసీలు సమైక్య పోరాటలకు సిద్ధం కావాలి

### తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తరతరాలుగా అన్ని రంగాల్లో అన్యాయానికి గురైన బీసీలు రాజ్యాధికారంలో వాటా కోసం సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సమావేశానికి బత్తిని సదానందం గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశ జన గణనలో బీసీ కులగణన చేపట్టాలని, మంత్రివర్గంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ లో బిల్లు పెట్టి ఆమోదింప చేయనిచో దేశవ్యాప్తంగా బీసీల ఆగ్రహాన్ని చవి చూడవలసి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా యుద్ధ ప్రాతిపదికన కులగణన పూర్తి చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ స్కాలర్ షిప్ లె తక్షణమే విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి ప్రసంగిస్తూ బీసీల డిమాండ్స్ పరిష్కరించకుంటే పాలకులకు బీసీల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అక్టోబర్ 28న హైదరాబాదులో జరగనున్న బీసీ రాష్ట్ర సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీసీ నాయకులు జక్కు రాజు గౌడ్, అనుకారి అశోక్, ప్రవీన్ గౌడ్, రమేష్, కర్రే లక్ష్మణ్, మాలోతు శంకర్ నాయక్, పోచయ్య, బి.మల్లయ్య, అంకుషావలి, కోరపల్లి రమాదేవి, దువ్వ కనక లక్ష్మి పాల్గొన్నారు.

# పీడీఎస్‌యూ 50ఏళ్ల సభను జయప్రదం చేయండి

## ఖిలా వరంగల్‌లో పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఈ నెల 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పీడీఎస్ యూ అర్ధ శతాబ్దోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్ లో పీడీఎస్ యూ ప్రస్తుత, పూర్వ నాయకులు పోస్టర్ ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశానికి పీడీఎస్ యూ వరంగల్ ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా పీడీఎస్ యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్, పూర్వ అధ్యక్షుడు ఎస్ రవి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి బండి కోటేశ్వరరావు, ఎలకంటి రాజేందర్, పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు గుర్రం అజయ్ మాట్లాడారు. దేశంలో జరిగిన నక్సల్ బరి శ్రీకాకుళ సాయుధ రైతాంగ ఉద్యమాలు, విప్లవ విద్యార్థి సంఘ నిర్మాణానికి ఊపిరినిచ్చాయి. ఈ క్రమంలోనే ప్రథమ విప్లవ విద్యార్థి సంఘంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 1974 అక్టోబరు 12, 13 తేదీలలో మొదటి మహాసభ హైదరాబాదులో జరుపుకొని నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. విప్లవ ప్రజాసంఘాలలో విప్లవోద్యమ నిర్మాణంలో పనిచేస్తున్నారని, రాజ్య హింసకు, శత్రు దాడులకు గురై అమరులైన వారిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విద్యార్థుల సమస్యలపైనే కాక కార్మిక, కర్షక, మహిళా పోరాటాలకు మద్దతుగా నిలిచిందని వారన్నారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ పోరాడిందని, విద్యా ప్రవేటీకరణ దేశంలో విదేశీ యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన కేంద్రం ప్రభుత్వ విధానాలపై పోరాటాలు చేసిందన్నారు. ఇదే కాక నేడు విద్యారంగంలో జరుగుతున్న మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020 విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో అగ్ర భాగాన నిలబడుతున్నదని వారు అన్నారు. ఈ సభలో ప్రముఖ సైంటిస్ట్, కవి గౌహర్ రాజా, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, బి ప్రదీప్, పి ప్రసాద్, తదితరులు ప్రసంగిస్తారని ఈ సభను జయప్రదం చేయాలని విద్యార్థి శ్రేణులను కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో మైదం సంజీవ పాలకుర్తి సత్యం నళిగంటి విజయ్ పాల్, మైదం పాణి, గంగుల దయాకర్, ఇనుముల కృష్ణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# నరకాసుర వధ ఉత్సవాలకు భారీ బందోబస్తు

## ఏసీపీ నందిరాం నాయక్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 30న ఉర్సు గుట్ట వద్ద నరక చతుర్దశి సందర్భంగా జరుగు నరకాసుర వధ ఉత్సవాలలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని కోరుతూ రకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఏసీపీ నందిరాం నాయక్‌కు మంగళవారం కార్యవర్గం వినతిపత్రం అందజేశారు. నరకాసుర వధ ఉత్సవాలకు దాదాపు 20వేల మంది ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయించాలని అధ్యక్షుడు మరుపల్ల రవి ఏసీపీ నందిరాం నాయక్‌ను కోరారు. ఏసీపీ నందిరాం నాయక్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ఉత్సవాల్లో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సహాయ కార్యదర్శి అవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్ దూడే కొమురెల్లి, కుమార స్వామి, మరుపల్ల శివ, కొమ్ము రాజు, మంద పవన్ ఉన్నారు.

# మాదిగల ధర్మ యుద్ధ మహాసభను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని కామారెడ్డి పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తిక్క శీను మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏకు శంకర్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా దేశంలోనే మొదటిసారి తానే వర్గీకరణ చేస్తానని, అవసరమైతే గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు ప్రత్యేకంగా ఆర్డినెన్స్ ను తీసుకువచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని చెప్పారు. ఆ మాట చెప్పి రెండు నెలలు గడుస్తున్నా చేయకపోగా కమిటీలు కమిషన్ల పేర్లతో కాలయాపన చేస్తూ మాదిగలను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. గ్రూప్-1, గ్రూప్-2 తో పాటు డిసెంబర్ నాటికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ లేకుండానే వాటిని పూర్తిచేసే పనిలో ఉన్నారని దుయ్యబట్టారు. మాదిగలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఖండిస్తూ మహాజన నేత మంద కృష్ణ మాదిగ తెలంగాణలో ఉన్న ఉమ్మడి జిల్లాల్లో పర్యటనలో భాగంగా ఈ నెల 26 న ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మ యుద్ధ మహాసభను జిల్లా లోని ప్రతి ఒక్క మాదిగ విద్యార్థి, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బోర్ర రాజయ్య మాదిగ, కుల పెద్దమనిషి, శ్రీపతి ఐలయ్య, మాజీ వార్డ్ మెంబర్ జేరిపోతుల రాజు, తిక్క భద్రయ్య, నాగయ్య దిలీపు, రఘుపతి, యశ్వంత్, వినయ్, రాకేష్ మాదిగలు, కామరెడ్డి పల్లి గ్రామ మాదిగ, రక్త బంధువులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గృహా పన్నుల వసూలే లక్ష్యంగా పని చేయాలి

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్,వాయిస్, డోర్నకల్ :** మానుకోట జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మంగళవారం డోర్నకల్ పట్టణాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గొల్లబజార్, టీచర్స్ కాలనీ, ముత్యాలమ్మ గుడి రోడ్డు, బతుకమ్మ పార్క్‌లలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, మౌలిక వసతుల కల్పన ద్వారా అభివృద్ధి పనులు నిర్వహించుటకు అవసరం ఉన్నచోట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, సానిటేషన్ నిర్వహించాలని సూచించారు. ఇటీవల రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కాలువను అనుసంధానం చేస్తు సుభాష్ వీధిలో మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని సూచించారు. పన్నుల వసూలే లక్ష్యం పూర్తి చేయాలని తద్వారా పట్టణాల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యం తడి చెత్త, పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లను తనిఖీ చేసి ఆడిషనల్ కలెక్టర్ మండల కేంద్రంలోని ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వసతిగృహాలను అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తరగతి గదులు, వసతుల వివరాలపై వాకాబు చేశారు. మున్సిపల్ కమిషనర్లు వెంకటస్వామి, నరేష్ రెడ్డి, డీఈలు, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# జిల్లా సంక్షేమ అధికారి అనురాధకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నూతనంగా విధుల్లో చేరిన సందర్భంగా వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి అనురాధను మంగళవారం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వరంగల్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సదానంద ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సలహాదారు రవీందర్, సీనియర్ అసిస్టెంట్ అరుణాదేవి పాల్గొన్నారు.

# విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వీలు పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ ఆఫీసులో పీడీఎస్‌యూ జిల్లా నిర్మాణ జనరల్ బాడీ సమావేశం రాచకొండ ఉదయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహారావు, కాంపాటి పృథ్వీలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని తీవ్రంగా ఆక్షేపించారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇంటర్, డిగ్రీలు పూర్తిచేసిన విద్యార్థులు వివిధ రకాల ఎంట్రన్స్ లలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలలో డబ్బులు కట్టి టీసీ, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీల గ్రూప్-1 ఉద్యోగాలకు ప్రధాన అడ్డంకిగా మారిన జీవో నెంబర్ 29ని తక్షణమే రద్దు చేసి, జీవో నెంబర్ 55ప్రకారం నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి, నిరుద్యోగ యువతను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం 13మందితో పీడీఎస్‌యూ మహబూబాబాద్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాచకొండ ఉదయ్, ఉపాధ్యక్షుడిగా బానోతు నందీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బోట్ల గౌతం, సహాయ కార్యదర్శిగా రామ్ చరణ్, కోశాధికారిగా గణేష్, మరో 8మంది జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# వీసీని సన్మానించిన ఫార్మసీ అధ్యాపకులు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ గా ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కే.ప్రతాపరెడ్డి నియమాకమైన సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో మంగళవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ విభాగానికి చెందిన డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ గాదే సమ్మయ్య, ప్రొఫెసర్ జనపరెడ్డి కృష్ణవేణి బోర్డ్ ఆఫ్ చైర్ పర్సన్, ప్రొఫెసర్ ఎన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ అండ్ హెడ్, డాక్టర్ స్వరూప, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాయదా, సీనియర్ ప్రొఫెసర్ వై.నరసింహ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ఫ్యాడ్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్థులకు ఫ్యాడ్ లు అందించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు సుమారుగా 120 పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కే హనుమంతరావు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాలల చైర్మన్ తాళ్లపల్లి స్రవంతి, ఉపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్, జయ, శివ చేతన్, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, సుభాని, జ్యోత్స్న, శారద, శివకుమార్, అశోక్ పాల్గొన్నారు.

## సురేష్ కుమార్ కుటుంబానికి ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సురేష్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో అతడి కుటుంబానికి తామంతా అండగా ఉన్నామంటూ 70 మంది మిత్రులు కలిసి పోగుచేసిన లక్ష రూపాయలను డీఎంహెచ్ఓ డాక్టర్.కె.లలితా దేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్ మోహన్ రావు చేతుల మీదుగా వారి కుటుంబానికి మంగళవారం అందజేశారు. వీరిని డీఎంహెచ్ఓ లతితా దేవి అభినందించడం జరిగింది.

## మంత్రి కొండా సురేఖను కలిసిన శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దంపతులను వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి అయోధ్య రామ మందిర ప్రతిమను బహూకరించి వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు వరంగల్ తూర్పు శివనగర్ లోని ముంపు ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని, వరంగల్ జిల్లా కోర్ట్ లోని జీపీ, ఏజీపీ, ఏపీపీ తదితర పోస్టులను పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులకు అవకాశం కల్పించి భర్తీ చేయాలని, లీగల్ సెల్ బలోపేతనికి కృషి చేసే న్యాయవాదులను నియమించాలని వారు మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు.

## నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే అనుమతులు

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భవన నిర్మాణాల కోసం నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లు, భవన నిర్మాణాల అనుమతుల కోసం పలువురు దరఖాస్తు చేసిన నేపథ్యంలో వాటికి అనుమతుల మంజూరు కోసం కమిషనర్ మంగళవారం నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, వడ్డేపల్లి, మడికొండ, ఎల్బీనగర్, దేశాయిపేట ప్రాంతాల్లో నిర్మిత ప్రాంతాలను కమిషనర్ పరిశీలించి నిర్మాణాల కోసం నమోదు చేసిన కొలతల వివరాలు క్షేత్ర స్థాయిలో కొలతలు వేసి నిర్ధారణ జరిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సరైన ధృవ పత్రాలు నమోదు చేసిన కొలతలు క్షేత్ర స్థాయిలో కొలతలతో సరిపోతే అనుమతులు జారీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఏసీపీ అర్షద్, సానిటరీ ఇన్ స్పెక్టర్ ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## లోక కళ్యాణానికి సహస్ర చండీయాగం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోతనగర్ లో మంగళవారం మణిదీప్ గార్డెన్ లో శ్రీకాంత్ అడిగ ఆధ్వర్యంలో వంశీకృష్ణ పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు సహస్ర చండీయాగం లోకకళ్యాణార్థనమై ఘనంగా జరిపించడం జరిగింది. ఈ యజ్ఞంలో సుమారు 500 మంది పాల్గొని లలిత సహస్ర పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఒడిశాల సుజాత, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దైవిక ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నింపుకోగలరని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు భద్రతకు చర్యలు చేపట్టాలి




### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్మన్ పి.ప్రావీణ్య వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ (డీఆర్ఎస్సీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ, పోలీస్, రవాణా, మున్సిపల్, ఆర్టీసీ, జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్యశాఖ, తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొని రోడ్డు భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణాల పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. వరంగల్ ఎన్ఐటీతో ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఈఈ సురేష్ బాబు, డీసీపీలు రవీందర్, సలీమా, ఏసీపీలు కిషోర్ కుమార్, దేవేందర్ రెడ్డి, తిరుమల్, సత్యనారాయణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలను వెంటనే అమలు చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని నున్న నారాయణ నగర్ 1, 2, 3 శాఖల రెండవ మహాసభ పంజాల ఉపేంద్ర, జంగా కళావతి, కుడకంటి అనిత అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రారంభ సూచికంగా అరుణా పతాకాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్న పేదలకు గృహ నిర్మాణ పథకం, వితంతువులు, వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు పెంపుదల ఊసే లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్, దళిత బంధు, ఇతర సంక్షేమ పథకాలు అమలు వైఫల్యం వల్లే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలను కదిలించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అతి నిరుపేదలకు 10 సంవత్సరాల నుండి కొత్త రేషన్ కార్డులు ఇవ్వక 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500లకే గ్యాస్ అమలు కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. వెంటనే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సంతాప తీర్మానాన్ని పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు అల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రవేశ పెట్టారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చీపిరి యాకయ్య, డి.హేమానాయక్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నక్క సైదులు పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభలో పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా గండి వీరేందర్ గౌడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** హైదరాబాద్ బాగ్ లింగంపల్లి కేంద్ర కార్యాలయంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ మంగళవారం గండి వీరేందర్ గౌడ్ ను బీసీ రాజ్యాధికార సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ బాధ్యతతో పాటుగా డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా డిస్ట్రిక్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పెద్ద కాసు కుమారస్వామి యాదవ్ ను నియమించారు. ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి ఉద్యమ కారుడిగా తెలంగాణ జేఏసీలో పనిచేసిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, యువకుడు ఉత్సాహవంతుడు “గండి వీరేందర్ గౌడ్ కు జిల్లా అధ్యక్ష పదవి అవకాశం కల్పించామని, ఆయన బీసీల అభ్యున్నతి, బీసీల రాజ్యాధికారానికై నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ దాసు సురేష్ నాయకత్వంలో మన మందరం బీసీల రాజ్యం కోసం పనిచేయడం అదృష్టమన్నారు. అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ నా బహుజన జాతులు ఆర్థికంగా, సామజికంగా, రాజకీయంగా వెనుక కు నెట్టేయా బడ్డారని, బహుజన జాతుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. తనను ప్రోత్సహించిన బీసీ ఉద్యమ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు గౌడ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్నగౌడ్, జేఏసీ మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ సమ్మెట వెంకన్న, బీసీ నాయకులు గాడిపెల్లి శేఖర్ గౌడ్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర స్థాయి హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ కాంపిటీషన్ లో హనుమకొండ, వరంగల్ జిల్లా విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అదికారులు ప్రకటించారు. మంగళవారం రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో 13 జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ రాష్ట్ర స్థాయి కాంపిటీషన్ లో హనుమకొండ, వరంగల్, తేజస్వి పబ్లిక్ స్కూల్, కాజీపేట్ కు చెందిన విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా ప్రథమ స్థానంలో నిలిచి రీజినల్ కాంపిటీషన్ కు సెలెక్ట్ కావడం జరిగింది. రాష్ట్ర స్థాయి విజేతలకు టీజీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి చేతుల మీదుగా రూ.10,000 నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను, దిశా (డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ సర్వీస్ ఫర్ హెచ్ఐవీ ఎయిడ్స్) సిబ్బందిని డీఎంహెచ్ఓ లలితాదేవి, ఏడీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్ రావు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొంది రీజినల్ స్థాయికి వరుసగా రెండవ సారి గెలువడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి, రామకృష్ణ పాల్గొన్నారు.

# శిశు గృహను సందర్శించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అనుబంధ సంస్థ ప్రత్యేక దత్తత విభాగం శిశు గృహను మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సందర్శించారు. ఈ సందర్భంగా వసతులను పరిశీలించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి, బాలల సంక్షేమ సమితి, బాలల పరిరక్షణ విభాగం, శిశు గృహ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా, శిశు గృహలో ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన వదిలివేయబడిన పిల్లలకు, సరెండర్ చేసిన పిల్లలకు, రక్షణ సంరక్షణ అవసరం ఉన్న పిల్లలకు ఆయా జిల్లాల బాలల సంక్షేమ సమితి వారి ఆదేశాల మేరకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి తెలియజేశారు. ప్రస్తుతం 11మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని, ఒకరికి దత్తత ప్రక్రియకు ఎంపిక కాబడగా మరో ఇద్దరు టైం లైన్ లో ఉన్నారని, మిగతా వారు రక్షణ, సంరక్షణ అవసరం ఉన్న పిల్లలని తెలియజేశారు. ప్రస్తుతం ఒకే శిశు గృహలో రెండు యూనిట్లు కొనసాగుతున్నాయని, దీనివల్ల నిబంధనల ప్రకారం కెపాసిటీ సరిపోదని తెలియచేయగా హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాలను కలిపి హనుమకొండ సెంటర్ పాయింట్ గా ఒక యూనిట్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను ఒక యూనిట్ గా కలిపి మహబూబాబాద్ జిల్లాను సెంటర్ పాయింట్ గా చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అలాగే, వెకెన్సీలో ఉన్న ఆయా పోస్టుల గురించి రాష్ట్ర సంచాలకులకు తెలియచేసి నియామక ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లోని జీఎంహెచ్ మదర్ మిల్క్ బ్యాంక్ నుంచి శిశు గృహ పిల్లలకు పాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె లలితా దేవి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు, సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జి అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, ఇన్ స్టిట్యూషనల్ ప్రొటెక్షన్ అధికారి ఎం.మౌనిక, శిశు గృహ మేనేజర్ దూడం నగేష్, సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# బాణసంచా వ్యాపారులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

## వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భద్రతా ప్రమాణాలను పాటిస్తూ బాణసంచా విక్రయదారులకు సూచించారు. దీపావళీ పండుగ సమీపిస్తున్న వేళ కమిషనరేట్ పరిధిలోని బాణా సంచా విక్రయదారులతో వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అగ్నిపాపక, పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడూతూ బాణాసంచా విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతుల కోసం వ్యాపారస్తులు ముందుగా తప్పనిసరిగా అగ్నిమాపక విభాగం అధికారుల నుంచి ఎన్ఓసీ పోందాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే వ్యాపారస్తులు స్థల యజమాని నుంచి అనుమతి పత్రాన్ని పోందాలని, ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి కావాలని, పక్కా భవనాల్లో వ్యాపారం నిర్వహించుకోనేవారు ముందుగా భవన ఇరుపక్కల ఇంటి యజమానుల అనుమతితో పాటు, భవన బ్లూ ప్రింట్ ఎనిమిది వందల రూపాయల ప్రభుత్వ బ్యాంక్ చాలాను దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా విక్రయదారులు తప్పనిసరిగా విక్రయాలు జరిపే ప్రదేశంలో అగ్ని ప్రమాదాన్ని నివారణకై వినియోగించే ఇసుక, నీరు, ఇతర అగ్ని ప్రమాద నిరోధక సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలని, వీలైనంత వరకు వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని ఇరుకు ప్రదేశాల్లో కాకుండా, విశాలమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు. గత అనుభవనాలను దృష్టిలో ఉంచుకోని వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండటమే పోలీసుల ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రధానంగా ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా వ్యాపారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడుతాయన్నారు. అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహించే వారిని కట్టడి చేసేందుకు టాస్క్ ఫోర్స్ పోలీస్ ప్రత్యేక తనీఖీ నిర్వహిస్తారని తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా బానాసంచా వ్యాపారం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండని పోలీస్ కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా ప్రజలు సైతం దీపావళి పండుగను జరుపుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా బాణాసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో పెద్దలు పిల్లల వద్ద ఉండాలని, తగు జాత్రలు పాటిస్తూ అనందోత్సల నడుమ దీపావళీ పండుగను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, జిల్లా అగ్నిమాపక శ్రీధర్ రెడ్డి, అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# కేయూ వీసీని కలిసిన ఉద్యోగ సంఘాల జాక్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డిని విశ్వవిద్యాలయ బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల జాక్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో ఉపకులపతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఉపకులపతిని కోరగా త్వరలో సంఘ నాయకులతో సమావేశమై ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానని ఉపకులపతి హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అందరు మమేకం కావాలని కోరినట్లు తెలిపారు. ఉప కులపతిని కలిసిన వారిలో జాక్ నాయకులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, రాయికంటి సురేష్ కుమార్, నాగుల శివప్రసాద్, సంగాల రాజమౌళి, డాక్టర్ అకునూరి సుదయ్య, కొడవటిగంటి దయాకర్, సంగాల సుధాకర్, సల్ల చేరాలు, బొచ్చు గోపి, మొహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



### కేయూ వీసీకి శుభాకాంక్షలు..

కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై రాంబాబు ఆధ్వర్యంలో కేయూ నూతన వీసీగా నియమితులైన ఆచార్య ప్రతాప్ రెడ్డికి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డికి వివరించారు. సమస్యల పరిష్కారానికి కేయూ వీసీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేందర్ నాయక్, డాక్టర్ ప్రగతి, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, డాక్టర్ ఎన్.శ్రీధర్ పాల్గొన్నారు.

# లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

## వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఆరుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.7000 జరిమాన విధించారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 16 మందికి రూ. 24,300 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా ఆడెపు రమేష్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ వరంగల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ మంగళవారం గీసుకొండ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా ఆడెపు రమేష్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆడెపు రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులను ఘోరంగా అవమానించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఆరు గ్యారెంటీ హామీలలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని కేటాయించి పక్కా ఇల్లు కట్టిస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న అమలు జరగడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోతే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరపున అలుపెరుగని పోరాటం చేసి ఉద్యమకారుల హక్కులను సాధించుకుంటామన్నారు. ఈ సందర్భంగా తనను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గీసుకొండ మండల అధ్యక్షుడిగా నియమించిన అధ్యక్షుడికి, జిల్లా అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం తన వంతు పాత్ర పోషిస్తానని పేర్కొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

## ఎన్‌హెచ్ఎం నేత రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం)లో 78 క్యాడర్లలో పని చేస్తున్న 17,541 మంది ఉద్యోగుల సమస్యలను నవంబర్ 16లోగా పరిష్కరించని పక్షంలో సమ్మెకు దిగుతామని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్‌హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు క్యాడర్ ఫిక్స్ చేసి బేసిక్ వేతనాలు అమలు చేయడంతో పాటు కొత్త జీవో జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, 2016 సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, బేసిక్ పే అమలు చేయాలని కోరారు. నవంబర్ 16 లోపు క్యాడర్ ఫిక్సేషన్లలో ఎటువంటి అవకతవకలు లేకుండా ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల మూల వేతనం ఉండే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను ఆయన హెచ్చరించారు.

# కొమురం భీంకు ఎమ్మెల్యేల నివాళి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జల్-జంగల్-జమీన్ అని నినదించి ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొమురం భీం జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర రోడ్ల మరియు భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాళులర్పించారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, సహచర ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, అక్టోబర్ 22, 2024






- అభాగ్యులకు కొండంత అండ
- పేదల పెన్నిదిగా ప్రత్యేక గుర్తింపు
- ప్రతి విషయంలో సమగ్ర ప్రణాళిక, లక్ష్యం ఆయన సొంతం
- ఆధిపత్యం ప్రదర్శించడంలో దిట్ట
- 62వ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం




# అసాధ్యుడు కొండా మురళి





**పొడుస్తున్న పొద్దు మీద ఉదయించిన సూర్యుడు కొండా మురళీధర్ రావు. చిన్నతనంనుంచే నాయకత్వ లక్షణాలను పునికిపుచ్చుకున్న ప్రజా నాయకుడు. ఆయనను అందరూ 'కేఎం' అంటూ ముద్దుగా పిలుచుకున్నా 'కొండా మా అండ' నినాదమే ఎక్కువగా పాపులర్ అయింది. కేఎం అంటే అదోక బ్రాండ్.. అక్రమార్కుల పాలిట సింహ స్వప్నం.. అభాగ్యులకు కొండంత అండ. ఆయన పేరు చెబితేనే విపక్షమే కాదు స్వపక్షంలోనూ హడల్.**

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** రాజకీయ రంగానికి కొత్త భాష్యం చెప్పి, కొత్త భావనలను మోసుకొచ్చి ఆ రంగానికి కొత్త సొగసులు దిద్దిన ఘనత కొండా మురళీకే దక్కుతుంది. ఏ అగ్ర నాయకుడి అండదండలు, ఆశీర్వాదాలు లేకున్నా స్వశక్తితో ఎదిగి అందరితో నేడు 'మురళన్న'గా పిలువబడుతున్నారంటే దానికి కారణం ప్రజలతో ఆయన మమేకమవడమే. కొట్లాటలు, పంచాయితీలు, సెటిల్మెంట్లు, జటిల సమస్యల పరిష్కారం అంటేనే ..ముందుగా అందరికీ గుర్తుకు వచ్చేది ఆయనే. అనుకున్న దానికోసం పరితపించే 'కేఎం' మనసులో ఏదైనా అనుకుంటే సాధించే వరకు విశ్రమించరు. ఆతడి నడవడిక.. చూసే విధానం విలన్ లక్షణాలు కనిపించినా నిజమైన భోళా శంకరుడు. రాజకీయాల్లో ఆయన పూర్తి పరిణతి చెందిన ప్రజానాయకుడు. ఉమ్మడి వరంగల్ జిల్లా.. అప్పటి శాయంపేట నియోజకవర్గంలో ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం కాలక్రమేనా రాష్ట్ర రాజధాని హైదరాబాదు వరకు విస్తరించింది. ముక్కుసూటితనం, అనుకుంటే ప్రాణమిచ్చే లక్షణం ఆయనను దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా చేసింది. కొండా మురళిలోని ప్రతిభను, ప్రజా సమ్మోహన శక్తిని వాడుకొని ఎంతోమంది చోటామోటా నాయకులు బడా నేతలుగా ఎదిగారు. జిల్లాలో కొందరు రాజకీయంగా ఆయనను అణచివేసే ప్రయత్నం చేసినప్పటికీ ఎప్పుడు ఏమరుపాటుతో ఉండే మురళి వేసే ఎత్తులు.. జిత్తుల ముందు అవన్నీ పటాపంచలయ్యాయి.

## బాల్యం.. విద్యార్థి దశ..

జననేత కొండా మురళీధర్ రావు 1963 అక్టోబర్ 23న కొండా చెన్నమ్మ–కొమురయ్య పటేల్ దంపతులకు కనిష్ట పుత్రుడిగా జన్మించారు. ఆయన విద్యాభ్యాసం స్వగ్రామమైన వంచనగిరి, ధర్మారంతో పాటు వరంగల్ లో కొనసాగింది. ఇంటర్, డిగ్రీ స్థాయిలో గ్యాంగ్ లు మెయింటైన్ చేస్తూ తన మిత్రులు ఎవరిపైనా ఈగ కూడా వాలనిచ్చేవారు కాదు. దివంగత మావోయిస్టు అగ్రనేత పోలం సుదర్శన్ రెడ్డి @ ఆర్కే ఇతనికి ఆత్మీయుడు. ఎల్బీ కళాశాలలో సహ విద్యార్థిని ప్రస్తుత రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 1987 మే 29న మిత్రుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదర్శ వివాహం జరిగింది.

## రాజకీయ ప్రస్థానం..

కొండా మురళి 1987లో వంచనగిరి గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం గీసుకొండ మండల పరిషత్ ఉపాధ్యక్షుడయ్యారు. 1991లో వంచనగిరి సింగిల్ విండో చైర్మన్ గా గెలుపొందారు. సుదీర్ఘకాలం ఆ పదవిలో కొనసాగిన కేఎం 2005 నవంబర్ 18న డీసీసీబీ చైర్మన్ గా ఎన్నికయ్యారు. 2009, 2015 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికై రాజకీయాల్లో స్థిరపడ్డారు. గతంలో కేఎం జిల్లా మున్నూరు కాపు యువత అధ్యక్షుడిగా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, పీసీసీ సభ్యుడిగా పలు కీలక పదవులను నిర్వహించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఎవరు నెంబర్ వన్ స్థానంలో ఉంటారో ఆయా సమయాల్లో వారికి ఆయన సన్నిహితుడిగా, అంతరంగికుడిగా మెదులుతూ వస్తున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అండదండలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ వెలుగు వెలుగుతున్నారు.



## స్టైలే వేరు..


ముటా కక్షలు.. వర్గ పోరు.. కుళ్లు, కుతంత్రాలకు నిలయమైన కాంగ్రెస్ పార్టీలో ఆ పరివారం మధ్య ఉద్భవించిన ఉత్తేజమే కొండా మురళీధర్ రావు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు బర్త అయినప్పటికీ అతని తీరు, వ్యవహార శైలి వేరు! అతని ఆలోచన సరళి, కార్యాచరణ, ఫార్ములానే వేరు. సమకాలీన రాజకీయాల్లో ముక్కుసూటితనంతో అదరక బెదరక మాట్లాడే ఆయన స్టైలే వేరు! రాజ్యం వీరభోజ్యం.. పోరాట స్ఫూర్తి ఉన్నవాడే కలబడి నిలబడతాడు. ఆ తర్వాత గెలుపును వశం చేసుకుంటాడన్న సూక్తిని నమ్మిన కొండా మురళి అదే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నారు. అయితే రాజకీయమే కాదు ప్రజల్లో భక్తి, త్యాగనిరతి, దానగుణం, స్నేహ భావాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో కోట గండి వద్ద శ్రీ కొండగిరి సాయినాథ ఆలయాన్ని కొండా మురళి సొంత ఖర్చులతో నిర్మించారు. వంచనగిరి గ్రామ అభివృద్ధితో పాటు సింగిల్ విండోకు జీవం పోసిన ఆయన డీసీసీబీపై చెరగని ముద్ర వేసుకున్నారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన ప్రజల హృదయాలను చూరగొన్నారు. రాజకీయాల్లో ఆటుపోట్లను తట్టుకొని 40 వసంతాలను పూర్తి చేసుకున్నారు.

## మాయల మరాఠీ..

రాజకీయాల్లో కేఎంగా సుపరిచితుడైన కొండ మురళీధర్ రావు చుట్టూ ఎప్పుడూ జనమే.. జనం. ఆయన చేతిలోని సెల్ ఫోన్లు ప్రతి నిమిషం హంగామా సృష్టించడమే గాక సమకాలీన రాజకీయ వ్యవస్థలో ప్రకంపనాలు సృష్టిస్తుంది. రాజకీయంగా మాటలు నేర్చిన వ్యక్తి కావడం వల్ల ఆయన కథలు చెప్పగలరు. 'మాయలు' చేయగలరు. తన మాటకారితనంతో ఎంతటి ఖటోర విషయాన్ని అయినా తన ఎత్తుగడల ద్వారా సునాయాసంగా పరిష్కరించే స్థాయికి ఎదిగారు. కాకతీయ గడ్డలో సంచలనాలు సృష్టిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుతూ కింగ్ మేకర్ గా ఆయన కీర్తి గడించారు. సీఎం రేవంత్ రెడ్డితో సాన్నిహిత్యం, సతీమణి సురేఖ మంత్రి కావడం వల్ల ఇతరుల కంటే ఎక్కువ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను శాసిస్తున్నారు. ప్రతి విషయంలో బహు చతురత ప్రదర్శించడమే కాకుండా ఎవరికి అర్థం కాని విధంగా ఎత్తుగడలు వేసే కొండా మురళి అంటే అందరికీ ఈ జిల్లాలో హడాల్,. ముఖ్యంగా నమ్మిన వారిని అన్ని విధాల పైకి తేవడంతో పాటు నచ్చని వారిని శంకరగిరి మాన్యాలకు పంపిస్తారు. జిల్లాలో తన మార్కును ప్రదర్శించేందుకు ఎవరికి ఏ రకమైన మంత్రం వేయాలో ఆయనకు బాగా తెలుసు కనుకనే మారుమూల గ్రామమైన వంచనగిరి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎవరికి ఏ పని కావాలన్నా ఆయనపైనే ఆధారపడుతున్నారంటే ఈ సంచలన కెరటం హవాను అర్థం చేసుకోవచ్చు. రాజకీయపరంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మినహా అందరితో సన్నిహిత సంబంధాలు కలిగిన కొండా మురళికి కొన్ని విషయాల్లో ప్రమేయం లేకుండానే శత్రువులు తయారయ్యారు. అయితే రాజకీయంగా పలు వివాదాస్పద కేసుల్లో ఇరుక్కున్న మురళికి ధర్మాసనాలు క్లీన్ చిట్ ఇచ్చాయి. సుమారు 23 కేసుల్లో వాస్తవాలు, ఆధారాలు లేవని అన్నికేసులు మూసివేశారు. అయితే కొండా మురళిపై లెక్కకు మించి కుట్రలు.. కుతంత్రాలు, హత్య ప్రయత్నాలు జరిగాయి. 1991 జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజు వంచనగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో కేఎం జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సందర్భంలో జనశక్తి నక్సలైట్లు ఆయనపై 47 రౌండ్ కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా ఆయనకు తుపాకి తూటాలు తగిలినప్పటికీ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించి ఉండటంతో మృత్యుంజయుడిగా బతికి బయటపడ్డారు. అందుకే మృత్యువును గెలిచిన ధీరుడిగా ఆయన కీర్తిగడించారు.

## మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్..


జనహృదయనేత కొండా మురళి 62వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వరంగల్ హంటర్ రోడ్ లోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ లో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఇందులో ఆరు వేల మంది యువకులు రక్తాన్ని దానం చేస్తున్నారు. జన్మదినోత్సవంలో భాగంగా 62 కిలోల భారీ కేకును సిద్ధం చేశారు. కేఎం జన్మదినోత్సవ కార్యక్రమానికి 15 వేల మంది పార్టీ కార్యకర్తలు హాజరుకానున్నారు.





















EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com